# భరతమాత గుండె పగిలింది

**నాయుడిగారింట్లో జూలీ భౌ మంది గేటు తీసుకుని వొస్తున్న రావుల్ని చూస్తూనే.**

ఆ ఇంటికి వొచ్చే వాళ్ళందరూ నాయుడిగారికిచ్చి నంత గౌరవమూ దానికీ ఇవ్వవలసిందే.

ఆ కుక్కకి భయపడుతూ. వొంగి వొంగి సలాము చేస్తున్నంత వినయంగా దాని వైపు చూస్తూ, ఒక్కొక్క అడుగే ముందుకేశాడు రావులు — అది కట్టేసిఉందన్న ధైర్యమే వాడిని అడుగులు ముందుకి వెయ్యనిచ్చింది.

భౌభౌ మంటూనే ఉంది అది నాయుడుగారి ఉప్పు తిన్న విశ్వాసంతో-

"జూలీ — " ఎస్వీ రంగారావు గొంతులా, ఖంగుమంది లోపల్నుంచి ఓ కంఠం. ఆ వెంటనే దాని తాలూకు ఆకారం — చిరంజీవి హెయిర్‌కట్టూ, కృష్ణంరాజు మీసకట్టూ, శోభన్‌బాబు పంచెకట్టూ, కమల్‌హాసన్ కమీజుకట్టూ, శరత్‌బాబు కళ్ళజోడు ఫ్రేము కట్టూతో — రజనీకాంత్‌లా సిగరెట్ నోట్లోకి విసురుకుంటూ, భాగ్యరాజ్‌లా ఓర చూపులు చూసుకుంటూ, కాదల్‌మన్నన్ జెమినీ స్టయిల్‌తో, నడిగర్ తిలకం శివాజీ హుందాతనంతో మొత్తమ్మీద రంగనాథ్ పర్సనాల్టీతో రంగంమీదకొచ్చింది —

ఆ శాస్త్రీయే రంగబాబు నాయుడుగారు — వయసెంతో లేదు ముప్ఫయి అయిదే — కానీ ఉంది ఆస్తి మూడు నాలుగు తరాలు తిన్నా తరగనిది. తండ్రీ తాత ముత్తాతలు కూడబెట్టింది. అర్థబలం, అంగబలమే కాదు — కావల్సినంత పొగరూ, పట్టలేనంత గర్వం. ఆ ఊళ్లో తనేం చేసినా చెల్లిపోతుందన్న తిమ్మిరితో కూడిన ధైర్యం కూడా ఉన్నాయి నాయుడికి — అతనికుంది అంతస్తు. ఆమెనికుంది మూడు లక్షలు కట్నంగా తెచ్చి, మొగుడంటే దేవుడే అని నమ్ముకున్న — కట్టుకున్నవాడు కండ కావరంతో కంఠం పిసికినా సరే, నాలిక పెళ్ళబెట్టాలే తప్ప నోట్లోంచి మాట రాకూడదని, తాను ఈదేశకముందునుంచీ నాయనమ్మచేత పాఠాలు వినీవినీ, వ్యక్తిత్వమంటే ఎరగని ఓ ప్రాణం ఉన్న భార్య అనే బొమ్మ.

" ఎవరు నువ్వు ? ఏం కావాలి ? " యజమాని గొంతులో చిరాకు కనిపెట్టి, యథాశక్తి తను కూడా ఆ వొచ్చిన వ్యక్తిమీద అధికారం, దర్పం చూపిస్తూ మళ్ళీ భౌమంది జూలీ రావులివైపు తిరిగి.

భయం భయంగా చేతులు కట్టుకు నిలబడ్డ రావులు, అతి వినయంగా జవాబిచ్చాడు సింహస్వప్నంలాంటి నాయుడుగారికి, ఆయనగారి గ్రామ సింహానికి కంబైన్డ్‌గా " అయ్ ! నేను రావుల్నండి .... అయ్ .... ఇక్కడ మీకాడ బట్టలుతికే కొండాలమ్మ మా ఇంటిదండీ .... అయ్ .... మా పిల్లగాడికి హఠాత్తుగా వాంతులై పోతున్నాయండి .... పిల్లాడి పేనం కడగట్టిపోతావుందండీ నీర్సంతో .... ఆసుపత్రికే తీసుకపోతాదో .... ఇంటోనే ఏదన్నా మందునూరి పోస్తదో ఓసారి చూసుకుంటదని పిలుచుకు పోదామనొచ్చానండీ .... ఇక్కడున్నట్లు మల్లా వొచ్చేస్తదండీ అయిదు నిమిషాల్లో .... ఒక్కసారి .... పిల్లగాడు అమ్మే కావాలని ఏడుస్తున్నా డండీ ....

" నీకేమన్నా మతిపోయిందా ? " కసురుకున్నాడు నాయుడు. సిగరెట్టు బూడిదమటుకు సుతారంగా దులిపాడు.

" అయ్ — " చేతులు మరింత గట్టిగా బిగించి కట్టాడు రావులు.

" బట్టలుతుకుతుంటే మధ్యలో ఎలా పంపిస్తాం అనుకున్నావ్ ? పనవగానే వొస్తుందిలే వెళ్ళు — ఇంతలోకే నీ ఇంతోటి పిల్లాడూ ఏ పై పోతాడు ? ఎండ పో యి ం ద ం టే మా బట్టలారవు — వెళ్ళు — తర్వాతొస్తుంది — "

" అయ్ ! — " నెత్తిగోక్కుంటూ వెనక్కి తిరిగాడు రావులు చేసేదిలేక. స్వర్గంలోంచి శ్రీశ్రీ గానీ, తిలక్ గానీ ఆ సీను చూసి ఉంటే అక్కడ తప్పక వాళ్ళు మరో " మరో ప్రస్థానం " గానీ, మరో " అమృతం కురిసిన రాత్రి " గానీ సృష్టించి ఉండేవారేమో ? —

బట్టలన్నీ ఉతికి ఆరేసి, ఇంటి కెళ్ళిన కొండాలమ్మకి, ఆగకుండా వాంతులవుతూ తోటకూరకాడకన్నా అధ్వాన్నంగా వేలాడిపోతున్న కొడుకు కనిపించాడు.

" పిల్లోడిని ఆసుపత్రికి తీసుకుపోదామని బైల్దేరబోతావుంటే నిలుచున్నపళంగా రమ్మని రెడ్డిగారింటికాడనించి కబురొస్తే, ముందు అరింటికి పోయొచ్చి అనక ఆసుపత్రికి పోతాను. లేకుంటే ఆ అయ్యగారు కోపం చేస్తారు పిలవనంపగానే రాలేదని " అంటూ అరింటికి పోయాడు రావులు. పక్కింటి అవ్వ కబురంద చేసింది కొండాలమ్మని చూస్తూనే.

" అట్టాగా — పోనీలే ఆరికెంత అ వు స ర వో ఏవో ? నేనొచ్చేశాగా — నే తీసుకపోతాలే ఆసుపత్రికి —" అందేగానీ, ఏడేళ్ళ కొడుకుని ధర్మాసుపత్రికి అంతదూరం ఎత్తుకెళ్ళలేక, రిక్షాకి డబ్బుల్లేక దిక్కులు చూసింది కాసేపు — ఆ తర్వాత కేకేసింది పక్కింటి సీతాలు కొడుకు నారిగాడిని.

" ఒరే నారిగా — నాయుడుగారింటికి పోయి ఒక్క నాలుగు రూపాయలు నే నిమ్మన్నానని అడిగి పట్టుకు రారా. జీతంలో ఇరగ్గోసుకో మన్నానని చెప్పు — అరిజెంటుగా కావాలిరా " —

" ఓ అలాగే " అంటూ వాడు దౌడందుకున్నాడు.

వరండాలో కూర్చుని కాఫీ తాగుతున్నాడు నాయుడు. ఆ రోజు లేచాక అదెన్నోసారో ఆయనగారికి తెలియదు — పైట చెంగు నిండుగా కప్పుకుని పతిదేవుడు తాగాక ఆ ఖాళీ గ్లాసు పట్టుకుని లోపలికి పోవడానికి పక్కనే నించబడ్డ ఆ భార్యామణికి తెలియదు తెల్లారి లేచాక ఇది ఎన్నో సారో తను కాఫీ అందివ్వడం ? రోజూ అన్నేసిసార్లు తాగడం ఆయనగారి అలవాటే అయినప్పుడు, ఇంకెందుకావిడకి లెక్కాడొక్కా ?

జూలీ భౌమనగానే అల్లంతదూరం ఎగిరిపడ్డాడు నారిగాడు.

" ఎవరూ నారిగాడా ? " పలకరించింది నాయుడిగారి భార్య.

" ఆయ్ — మా కొండాలమ్మ పిన్ని అస్పత్రికి తీసికెళ్ళాలంటండీ అబ్బాయిని — రిచ్చాలో ఎళ్ళాలటండీ — ఒక్క నాల్రూరూపాయి లట్టమ్మందండి మిమ్మల్నడిగి — జీతంలో ఇరగ్గోసుకోమందండి —" గబగబా అప్పచెప్పేశాడు నారిగాడు బిక్కమొహంతో. జూలీ వంక చూస్తూ — సింహంలా అది తన మీదికి ఉరికి ఉరికి వొస్తానంటోదాయె మరి ! —

" రిక్షా కావల్సొచ్చిందా ? నడిచిపోలేదా ? దానంతస్తుకి తక్కువా నడిచిపోతే ? ఇప్పుడు చిల్లరలేదు వెళ్ళు — " చిర్రుబుర్రులాడాడు నాయుడు. జేబులో రూపాయీ, రెండూర్పిపాయిల నోట్లు " మేమున్నాం మేమున్నాం " అంటూ గరగరలాడాయి చేయి తగిలి.

" పాపం ! నెల మధ్యలో ఒక్క రూపాయన్నా ఇంతవరకూ ఎప్పుడూ అడిగి ఎరుగదు కొండాలమ్మ — పిల్లాడెలా ఉన్నాడో ఏవిటో

పాపం .... నా దగ్గరుంది చిల్లర ఇవ్వనాండీ ? " చాలా నెమ్మదిగా, భయంగా భర్తని అడిగింది మూడు లక్షల కట్నంతోపాటూ, కావల్సినంత సారె, సంసారానిక్కావల్సిన మంచాలూ, కుంచాలూ మొదలైన సామాను పట్టుకొచ్చిన, ఓ పెద్ద నాయుడిగారి గారాబు కూతురు .... ప్రస్తుతం ఆ ఇంటి గృహలక్ష్మి.

" నువ్వు నోర్మూసుకుని లోపలికి నడు .... అడగ్గానే ఇచ్చి మనం లోకువైపోవాలా ? నీకసలు లోకం తెలిసేడిస్తేగా ? అడగ్గానే ఇవాళ ఇచ్చావంటే ఇంక అస్తమానం ఇలాగే మొదలెడతారు.... వీళ్ళ సంగతి నీకు తెలియదు .... పోరా పో .... ఇప్పుడు చిల్లర్లేదని చెప్పు " అంటూనే పక్కనే స్టూల్‌మీద ఉన్న కుక్క బిస్కట్ల డబ్బాలోంచి ఒకటి తీశాడు. ఆ బిస్కట్లేమిటో తెలియక, అది తనకివ్వబోతున్నారేమో నన్న సంతోషంతో నారిగాడి కళ్ళు మెరిశాయి ఒక్కక్షణం.

" జూలీ .... క్యాచ్ .... " యజమాని విసిరిన బిస్కట్ అవలీలగా అంతదూరం నించే నోటితో అందిపుచ్చుకుంది జూలీ. నారిగాడికాట్టే వయసులేదు .... వాడి బుఱ్ఱ ఇంకా ఎదగలేదు .... వాడసలు చదువుకోలేదు. వాడికి కవిత్వం అంటే ఏమిటో అసలే తెలియదు.... లేకపోతే పాపం .... నేనే ఈ జూలీగా పుట్టి వుండకూడదా అని ఒక్క క్షణమైనా అనుకుని ఉండేవాడేమో ? — పరా పరా చిటికెలో బిస్కెట్ జూలీ తినేస్తుంటే గుటకలు మింగుతూ చూశాడు.

" ఏవిఁరా ఇంకా నిలబడ్డావ్ ? పొమ్మంటే వినపళ్ళేదా ? " యజమాని చిర్రుబుర్రు మనగానే, తాను కూడా గుర్రుమంటూ వాడివంక చూసింది జూలీ. మళ్ళీ మళ్ళీ దాని అరుపుకి హడలిపోయిన నారిగాడు వీపుమీద గట్టిగా మూడుసార్లు కొట్టుకుని, వెనక్కి తిరిగి చూడకుండా కాళ్లకి బుద్ధిచెప్పాడు.

"కాసింతసేపు పిల్లగాడిని కనిపెట్టుకునుండవ్వా, నేనిప్పుడే వొచ్చేస్తా" నంటూ అవ్వని పిల్లాడిదగ్గర కూచోపెట్టి ఇంట్లో ఉన్న ఇత్తడి చెంబు చీర కొంగులో చుట్టుబెట్టుకుని, పక్క సందులో ఉన్న మార్వాడి కొట్టుకెళ్ళి తాకట్టుపెట్టి వాడిచ్చిందేదో చేతపుచ్చుకుని పడుతూ లేస్తూ పరిగెత్తుకొచ్చింది కొండాలమ్మ.

"ఇంతాలస్యం చేశావేమిటి అస్పత్రికి తీసుకురావడం? ఇంకొంచెం ఆలస్యమై ఉంటే పిల్లాడి ప్రాణానికే ముప్పొచ్చేది ...." అంటూ ధర్మాసుపత్రిలో డాక్టరు నానా చివాట్లు వేశాడు. మౌనంగా భరించింది కొండాలమ్మ .... కారణం .... రావడం ఆలశ్యం ఏందుకైందో ఆ వివరాలు చెప్తే వినే అవసరం ఆ డాక్టరుకి లేదని ఆమెకి తెలుసు .... పైగా ధర్మాసుపత్రిలో తనబోటి దరిద్రులకి ధర్మంగా మందులిస్తున్నందుకు (నీళ్ళల్లో పాలు కలిపి పాలవాడు పోసినట్టు .... నీళ్ళల్లో మందు కలిపి పోసే పోగాక) చివాట్లు వేసే అధికారం ఆ డాక్టర్లకుందని మనస్ఫూర్తిగా నమ్మింది. ఎలాగైతేనేం .... దాని కొడుక్కి నయమైంది .... వాడు లేచి మామూలుగా తిరగడం మొదలెట్టాక అమ్మయ్య అనుకుంది.

*

ఊరి చివర నూతిలోపడి కొండాలమ్మ ఆత్మహత్య చేసుకుందన్న వార్త ఆ పేట పేటంతా గుప్పుమంది. ఎంత ఘోరం చేసిందని కొందరంటే .... ఎందుకింతపని చేసిందోనని మరికొందరు .... మొత్తంమీద కట్టుకున్న మొగుడు రావులిక్కూడా అదంతపని ఎందుకు చేసిందో, ఆత్మహత్య చేసుకునేంత విరక్తి హఠాత్తుగా ఎందుకు పుట్టిందో తల బద్దలుకొట్టుకున్నా అర్థం కాలేదు. కొడుకుని గుండెలకదుముకుని గుడిసె గుమ్మంలో కూచుని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు .... ఇరుగు పొరుగంతా అక్కడే ఉన్నారు. క్రితం రోజు రావులు ఊళ్ళో లేడు .... పొరుగూర్లో ఉన్న వాళ్ళ నాన్నకి ఒంట్లో ఏమాత్రం బాగులేదు. ఓసారొచ్చి

చూసిపొమ్మని కబురొస్తే చూసి రావటానికి వెళ్ళాడు .... తిరిగొచ్చేటప్పటికి వాడికోసం ఈ ఘోరమైన వార్త ఎదురుచూస్తోంది. ఎండుపుల్ల లేరుకుందుకు నాయుడిగారి తోటపక్కకి కొండాలమ్మ వెళ్ళడం వరకే అవ్వకి తెల్సు. ఆ తర్వాత ఏవైందీ ఎవరికీ తెలియదు .... ఇంత ఘోరానికెందుకు పాల్పడిందో అసలే తెలియదు .... నాయుడుగారంతటి మనిషి .... ఆ ఊరికి పెద్దమనిషి తనని పరామర్శించటానికి వొచ్చేసరికి రావులికి మతిపోయింది.

"తమరొచ్చారా బాబూ !" అంటూ కృతజ్ఞతతో మెలికలు తిరిగిపోయాడు.

"ధైర్యం తెచ్చుకో రావులూ ! ధైర్యం తెచ్చుకో .... నిన్నూ, నీ కొడుకునీ చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది .... వొంచిన తలెత్తకుండా తన పని తను చేసుకుపోయేది మా ఇంట్లో .... పాపం చాలా మంచిది .... మా ఆవిడ కూడా కొండాలమ్మ చాలా మంచిదండీ అంటూ అస్తమానం పొగిడేది .... ఏవంత కష్టం వొచ్చిందని ఇంత అఘాయిత్యం చేసింది ? ఎలాంటివాళ్ళు ఈ రోజుల్లో శుభ్రంగా తలెత్తుకు ధీమాగా తిరుగుతున్నారు .... దేన్నీ లెక్కచెయ్యవలసిన అవసరంలేదు ఈ కాలంలో .... ఏవిటో తల్చుకుంటే గుండె చెరువవుతుంది .... ధైర్యంగా ఉండు .... ఏం చేస్తాం ? ధైర్యం తెచ్చుకుని జరగవలసిన తతంగం చూడు .... అలస్యమైతే పిల్లాడు ఆకలితో శోషొచ్చి పడిపోగలడు ఏడ్చి ఏడ్చి ...." అంటూ కాస్త డబ్బు రావులి చేతిలో పెట్టాడు.

నోట మాటరాక, కళ్ళనీళ్ళతో చేతులు జోడించాడు రావులు. తన పట్టు విడిపించుకోలేక, కళ్ళ నీళ్ళతో చేతులు జోడించి మొరపెట్టుకున్న కొండాలమ్మ రూపం కళ్ళముందు కనిపించి తడబడ్డాడు నాయుడు. అంతలోకే మళ్ళీ తనకి తనే చెప్పుకుంటున్నట్టు ఏవిటో ఇంతమాత్రానికే ఇంత అఘాయిత్యం చేసుకోవాలా అనుకుంటూ, అక్కడితో ఆ రూపాన్ని కంటిముందు తుడిచేసి ఇంటివైపు కదిలాడు.

మధ్యాహ్ననికి నాయుడుగారింటినించి ఘుమఘుమలాడే వాసనల్తో నాలుగు రకాల అధరువుల్తో రావులకీ, కొడుక్కి భోజనం వచ్చింది. పైకలా కసురుకున్నట్టు మాట్లాడుతారు గానీ, ఎంత జాలిగుండె నాయుడి గారిది అనుకున్నాడు రావులు. రావులే కాదు ఇరుగు పొరుగు కూడా అలాగే అనుకున్నారు ....

అల్లంత దూరంలో, వేపచెట్టు వెనకాల నిలబడి చూస్తున్న ఆరేళ్ళ చంద్రం నోట్లో నీళ్ళూరాయి ఆ వంటకాలు చూసి .... వాడు కడుపునిండా అన్నం తిని చాలారోజులైంది. తల్లి భారతమ్మ నాయుడి గారింట్లో పాచిపని చేస్తుంది. తండ్రి బుద్ధిపుట్టిన రోజు కూలిపనికి పోతాడు లేనిరోజు లేదు .... కూలి పనికి పోయినా పోకపోయినా, పెళ్ళాం తెచ్చే నాలుగు డబ్బులూ కూడా వాడే లాక్కుంటాడు .... ఇద్దరి సంపాదనా కూడా వాడి తాగుడికి ఏ మూలకి చాలదు. ఆ కోపం, ఆ తిక్క చూపించుకుందుకు తేరగా పెళ్లావేగా దొరికింది మరి ? .... చావ చితక తంతూఉంటాడు .... పిల్లాడు తింటున్నాడా లేదా ! పెళ్ళానికి తినడాని కుంటోందా లేదో .... ఇవేవీ వాడికక్కర్లేదు.... రోజూ తన్నులు తినిపిస్తున్నాను కదా, ఇంక వీళ్ళకి వేరే తిండెందు కనుకుంటాడేమో ?.... చంద్రానికి తండ్రంటే సింహస్వప్నమే. ఆకలని గట్టిగా ఆ ఇంట్లో అడగడానిక్కూడా భయమే వాడికి .... తల్లికి వారం రోజులుగా నిప్పులా కాలుతున్న జరం. లేవట్లేదు .... పన్లోకి వెళ్ళట్లేదు. ఓ పూట అర్ధాకలిగా నైనా తినే ఆ మిరపకాయీ, అన్నం కూడా కరువైందిప్పుడు వాడికి. పెళ్ళాం ఒళ్ళు మసిలే జరంతో, తలనెప్పితో, ఒళ్ళునెప్పుల్తో లేవలేకుండా పడిఉండడంతో, ఇంక ఇంటికొస్తే ఎదురు దానికే ఏవన్నా సేవ చేయాల్సొస్తుందని ఇంటి మొహమే చూడటం మానేశాడు వారం రోజులుగా ఆ కట్టుకున్నవాడు. కల్లుపాకలోనే తెల్లారుతోంది వాడికి రోజూ.

నాయుడుగారు పంపిన మసాలా ఘుమఘుమల వంటలు రావులిచేతా, వాడి కొడుకుచేతా, పక్కనే కూచుని అవ్వ తినిపిస్తుంటే .... నోట్లో నీళ్ళూరుతూ ఇంతింత కళ్ళు చేసుకుని చెట్టుచాటునించి చూస్తున్న చంద్రం ప్రక్కనే వొచ్చిచేరాడు నాగులు.

“ వాళ్ళమ్మ చచ్చిపోయింది కదా .... అందుకని పాపం అన్నం పంపించారు నాయుడుగారు వాళ్ళకి .... ” రావులీ కొడుకువైపు వేలితో చూపిస్తూ పెద్ద అరిందాలా చెప్పాడు.

“ వాళ్ళమ్మ నాయుడిగారింట్లో బట్టలుతికే పని చేసేది కదా .... అందుకని పాపం నాయుడిగారికి జాలిట .... ”

“ వాళ్ళమ్మ చచ్చిపోయిందా ? అంటే ఏంటీ ? ....” అర్థంకాలేదు ఆరేళ్ళ చంద్రం బుజ్జికి.

“ అంటే ... అంటే .... చచ్చిపోవడం అం టే దేవుడిదగ్గిరి కెళ్ళిందన్నమాట.... అలా అని మా అమ్మ చెప్పింది .... ”

“ ఓహో .... ” అర్థమైనట్టు బుజ్జ ఊపాడు చంద్రం .... కాళ్ళీడ్చు కుంటూ ఇంటిదారి పట్టాడు. సరిగా నాయుడిగారింటి వెనకే చంద్రం వాళ్ళ గుడిసె.

నాలుగు రోజులు గడిచిపోయాయి. భారతమ్మ అనారోగ్యం ఎక్కువైందే తప్ప ఏమాత్రం తగ్గలేదు.

“ దేవుడా ! ఈ బాధ భరించలేను .... నన్ను తీసుకుపో నాయనా నీ దగ్గిరికి ” అంటూ నాలుగు రోజులుగా పదే పదే మూలుగుతూ గొణగడం ఎక్కువైంది ఒంట్లో బాధ భరించలేక.

నాలుగు రోజులుగా ఈ మూలుగు వింటూనే ఉన్నాడు చంద్రం. అది వింటుంటే .... తల్లి దేవుడి దగ్గిరకి వెళ్ళిపోతుందన్న అభిప్రాయం బలపడిపోయింది వాడిలో. అమాయకంగా తల్లి మొహంలోకి చూసేనాడు ఏదో ఆలోచనలతో అ చిన్ని బుజ్జ తికమకపడుతుంటే.

ఆ రోజు పొద్దున్నించీ, కొడుకు చేయి పట్టుకుని వొదలకుండా చాపమీద తన పక్కనే కూర్చోపెట్టుకుంది భారతమ్మ మూలుగుతోంది ,. కళ్ళనీళ్ళు పెట్టుకుంటోంది ... గొణుగుతోంది.... "నేనెళ్ళిపోతే నిన్ను చూసే దిక్కెవర్రా.... మీ అయ్య నిన్ను చూడనే చూడడు.... వొద్దురా వొద్దు .... నిన్నొదిలి నే పోను .... నిన్నొంటరిగాడిని చేసి నీ కన్నాయం చేసి నే పోను.... నిన్నొదలి నే పోతే నిన్ను పెంచి పెద్దచేసే, దిక్కేది ? .... ఆ దేవుడితో దెబ్బలాడైనా సరే నేనిక్కడనే ఉంటాను .... నే బతుకుతాను ఆ దేవుడే వొచ్చినా నిన్నొదలి పోను .... "

చంద్రం కళ్ళల్లో కొద్దిగా భయం తొంగిచూసింది.... అ రోజు నాయుడుగారు రావులింటికి పంపిన రకరకాల వంటలే కళ్ళముందు కనపడుతున్నాయి.... కొండాలమ్మత్త దేవుడి దగ్గరకెళ్ళిపోయిందని ఎన్నిరకాల వంటలు రావులుమావావాళ్ళకి పంపించారు నాయుడుగారు .... అమ్మ పని చేసేది ఆ నాయుడుగారింట్లోనేగా ? ....

నాయుడిగారింట్లోంచి వొస్తున్న మసాలా వాసనలు చంద్రం ముక్కుపుటాల నదరగొడుతున్నాయి.... వారం రోజులుగా వాడిలో రగుల్తున్న ఆకలి మంటల్ని, ఆ వాసనలు మరింత మండిస్తున్నాయి ఆజ్యం పోసినట్లు.

" వొద్దు .... నిన్ను అనాధని చేసి ఆ దేవుడిదగ్గరకూడా పోను " కొడుకు చేతిని మరింత గట్టిగా పుచ్చుకుంది భారతమ్మ మూలుగుతూ బాధగా.

నాయుడుగారు, తన మనుషులచేత, ఘుమఘుమలాడే వంటకాలు తనకోసం పంపించినట్టు కళ్ళముందు ఊహ చిత్రాలు గీసుకుంటున్న చంద్రం కళ్ళల్లో ఒక్కసారిగా నిరాశ ఆవరించింది.

" అయితే .... నువ్వివాళ దేవుడి దగ్గరకి వెళ్ళవా అమ్మా ? .... ముందుకి వొంగి, తల్లి కళ్ళల్లోకి చూడటానికి ప్రయత్నిస్తూ అడిగాడు ఉండబట్టలేక అతి మెల్లగా.

కన్నబిడ్డచేత అటువంటి ప్రశ్న వేయించిన దారిద్ర్యపు రాక్షసిని చీల్చి చెండాడలేని నిస్సహాయతతో భరతమాత గుండె పగిలింది.